క్లుప్తంగా

అన్నదాన ట్రస్టుకు విరాళం



అధికారులకు చెక్కును అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని అన్నదాన ట్రస్టుకు గురువారం చిత్తూరుకు చెందిన రమక్క కుటుంబ సభ్యులు చెక్కు రూపంలో రూ.1,00,116 విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం అధికారులు దాత కుటుంబ సభ్యులకు స్వామి వారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

4న విద్యుత్ అదాలత్

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం జూలై 4న విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో రూరల్ ఈఈ హరి తెలిపారు. పైపల్లె, చిత్తూరు రూరల్స్‌–1 సబ్‌డివిజన్ల పరిధిలోని బంగారుపాళెం, యాదమరి, ఐరాల, తవణంపల్లె మండలాల పరిధిలోని వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. పైపల్లె క్రాస్‌లోని సబ్‌స్టేషన్‌లో ఉదయం 11.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. సమస్యలను అందులో తెలియజేయాలన్నారు.

ఇంటర్ ఫలితాల్లో టాపర్లకు నజరానా!

పలమనేరు: పట్టణంలోని మధు, శ్రీవాణి కళాశాలల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.లక్ష నజరానాను గురువారం స్థానిక కళాశాలలో చిత్తూరు డీఎఫ్‌ఓ చైతన్యకుమార్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. రెండ్రోజుల క్రితం విడుదలైన ఇంటర్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు 466 మార్కులను సాధించిన కరిష్మా, చేతన, బైపీసీలో 440కి 436 సాధించిన అల్బిన్, సీఈసీలో 500లకు 486 సాధించిన పిజ్జా అంజుమ్‌లకు ఈ మొత్తాన్ని అందజేశారు. డీఎఫ్‌ఓ మాట్లాడుతూ, ఇంత భారీ మొత్తంలో నగదు బహుమతులందించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. టాపర్లుగా అమ్మాయిలే ఎక్కువగా ఉన్నారని అబ్బాయిలు సైతం బాగా చదివి టాపర్లుగా నిలవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి రెడ్డి మాట్లాడుతూ, ఇకపై ఏటా టాపర్స్‌కు ఇలాగే నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని ప్రకటించారు. ప్రతి ఒక్కరూ బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీవాణి, వైస్ ప్రిన్సిపాళ్లు ఆనంద్‌రెడ్డి, గోపీనాథ్, సుబ్రమణ్యం రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వెలుగు సిబ్బంది



ఎమ్మెల్యేను కలిసిన వెలుగు సిబ్బంది

గుడిపాల: మండల వెలుగు సిబ్బంది, సంఘమిత్రలు, గ్రామ సమాఖ్య లీడర్లు గురువారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌ను చిత్తూరులోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీఎం సుధారాణి, వెలుగుసీసీలు లోకనాథరెడ్డి, హేమచంద్రారెడ్డి, మల్లీశ్వరితో పాటు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రతి ఒక్కరూ సమన్వయంగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు.

చచ్చినా చావే..!

- శ్మశాన వాటికల నిర్వహణపై చేతులెత్తేశారు
- ఏమాత్రం పట్టించుకోని కార్పొరేషన్
- అంత్యక్రియలు చేయాలంటే చావు కష్టాలే!





సంజయ్‌గాంధీ నగర్ వద్ద ముళ్ల కంపలతో నిండిపోయిన శ్మశాన వాటిక, (ఇన్‌సెట్) ప్రభుత్వ ఐటీఐ పక్కన శ్మశాన వాటిక దుస్థితి

చిత్తూరు అర్బన్: మనిషులు బతికున్నపుడు మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించలేని యంత్రాంగం.. అదే మనిషి చనిపోయాక కనీసం గౌరవప్రదంగా సాగాల్సిన అంత్యక్రియలను కూడా పట్టించుకోవడం లేదు. చిత్తూరులో పలుచోట్ల శ్మశాన వాటికల నిర్వహణపై కార్పొరేషన్ అధికారులు చేతులెత్తేశారు. ఇక్కడ వసతులు, సదుపాయాలు కల్పన కలగా మారిపోయింది.

సౌకర్యాలేవీ?

చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో 21 శ్మశాన వాటికలు ఉన్నాయి. విలీన పంచాయతీలతో పాటు 50 డివిజన్లలో ఇన్ని శ్మశాన వాటికలు ఉన్నాయనే విషయం కార్పొరేషన్ యంత్రాంగానికి తెలియదు. వీటిల్లో కైలాసపురం తప్ప మరే శ్మశాన వాటిక వద్ద కనీస సౌకర్యాలు కనిపించవు. మృతులకు అంత్యక్రియలు నిర్వహించడానికి కనీసం నడవడానికి కూడా దారి లేకుండా ముళ్ల కంపలతో నిండిపోయిన శ్మశానవాటికలు పదుల సంఖ్యలో ఉన్నాయి. ఇలాంటిచోట్ల అంత్యక్రియలు నిర్వహించడం ఓ సాహసంగానే చెప్పొచ్చు. మృతదేహాన్ని పూడ్చిపెట్టడానికి గుంతలు తీసే అవకాశం ఉండదు. ఎటు చూసినా ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలతో నిండిపోయి ఉంటున్నాయి. ఇక కాష్టం పెట్టే ఆచారం ఉన్నవాళ్ల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. మృతదేహానికి కాష్టం పెట్టేప్పుడు కనీసం పైకప్పు కూడా ఉండదు. కాలుతున్నప్పుడు వర్షం పడితే అంతే సంగతులు. నగరంలోని ప్రభుత్వ ఐటీఐ, సంజయ్‌గాంధీ నగర్ కాలనీ వద్ద ఉన్న శ్మశాన వాటికల్లో ఇలాంటి దృశ్యాలు నిత్యం తారసపడుతుంటాయి. ఎలాగో నానా తంటాలుపడి అంత్యక్రియలు పూర్తి చేసి, తిరిగివెళ్లేప్పుడు కాళ్లు చేతులు కడుక్కోవడానికి నీళ్లు కూడా ఉండటం లేదు. ఇక శుభస్వీకరణ కార్యక్రమాలు శ్మశాన వాటికల్లో చేసేవాళ్లయితే అన్నీ ఇంటి నుంచే తెచ్చుకునే పరిస్థితి తప్పడం లేదు.

ఎందుకో ఇంత నిర్లక్ష్యం?

శ్మశాన వాటికలపై కార్పొరేషన్ అధికారులు ఆది నుంచి పెద్దగా దృష్టి సారించిన పాపానపోలేదు. ఈ ప్రదేశాలు తమకు సిరులు కురిపించవని అనుకున్నారో..? కాసులు కురిపించే కల్పవృక్షాలు కావనుకున్నారో..? అధికారులకే తెలియాలి. చిన్నపాటి మురుగునీటి కాలువలో అర్ధగంట పూడిక తీయించి, 74 గంటలు యంత్రాలతో పనులు చేసినట్లు తప్పుడు బిల్లులు సృష్టించే ఉద్దండులు పారిశుద్ధ్య భాగంలోనే కనిపిస్తారు. అలాంటి అధికారులే శ్మశాన వాటికల నిర్వహణ బాధ్యత కూడా చూడాల్సి ఉంది. కానీ ఇక్కడ మాత్రం ఏ చిన్నపని చేయకపోవడం విమర్శలకు దారితీస్తోంది. ఇక్కడ కూడా అవినీతి చేయాలని కాకుండా.. కాస్త మానవతా దృక్పథంతో ఆలోచించాల్సిన అవసరం ఉంది. శ్మశాన వాటికలకు కాటికాపరుల ఏర్పాటు, నీటి సౌకర్యం, కూర్చోవడానికి చిన్నపాటి షెడ్ల నిర్మాణంపై ఇప్పటికైనా కమిషనర్ దృష్టి సారిస్తే ప్రజలు హర్షిస్తారు.

చర్యలు తీసుకుంటాం



శ్మశాన వాటికల నిర్వహణ మాదే. నగరంలో ఎన్ని శ్మశాన వాటికలు ఉన్నాయి? ఎక్కడెక్కడ ఉన్నాయి? ఏయే వసతులు ఏర్పాటు చేయాలనేదానిపై మా వాళ్లతో మాట్లాడుతాం. అనంతరం విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి కనీస వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటాం.

–డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, ప్రజారోగ్యశాఖ అధికారి, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్

మామిడి పంట పరిశీలన

పూతలపట్టు: మండలంలోని బైటపల్లె ప్రాంతంలో సాగులో ఉన్న మామిడి పంటను గురువారం ఉద్యానవన శాఖాధికారి వింధ్య పరిశీలించారు. కురుస్తున్న వర్షాలకు మామిడి పంటను పండు ఈగ ఆశించినట్లు గుర్తించారు. వాటి నివారణకు పలు సూచనలు, సలహాలు చేశారు. రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే పండు ఈగ నుంచి బయట పడవచ్చని ఆమె తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌ఎంకు సన్మానం



పరమానందయ్య దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: స్థానిక దళితవాడ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తూ గత నెల విరమణ పొందిన పరమానందయ్యను గురువారం సాయంత్రం ఉపాధ్యాయులు సన్మానించారు. బంగారుపాళెం మొయిన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి పరమానందయ్య చేసిన కృషిని అభినందించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు పరమానందయ్య దంపతులకు పూల దండలు వేసి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్





గుడిపాల: వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ చంద్రమహేష్, తవణంపల్లె: సేవలందిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదలకు వరమని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని పట్రపల్లెలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 45 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. బాలింతలు, గర్భవతులు, బీపీ, మధుమేహవ్యాధిగ్రస్తులకు, వృద్ధులకు వైద్య పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమం అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, డీఈఓ విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటివద్దే వైద్యం

గుడిపాల: మంచాన పడ్డవారికి ఇంటివద్దే వైద్యం అందజేస్తున్నట్లు డాక్టర్ చంద్రమహేష్ తెలిపారు. చుక్కావారిపల్లె గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. మంచానికి పరిమితమైన రోగుల ఇళ్లవద్దకు వెళ్లి చికిత్సలు చేశారు. అనంతరం గర్భిణులకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులను పరీక్షించి ఉచితంగా మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది అనిత, అనురాధ, చంద్ర, బాబు, శివగామి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న వాసు ట్రస్ట్ నిర్వాహకులు

ఐరాల: మండలంలోని 35 యర్లంపల్లె ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం వాసు ట్రస్ట్ నిర్వాహకులు రాజారాం, సుబ్రమణ్యం, ఈశ్వర్, ఎంఈఓ దామోదర్‌నాయుడు ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ, విద్యార్థులకు అవసరమైన వాటిని దాతలు ఇవ్వడం అభినందనీయమని, దాతల నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తేవాలన్నారు. అనంతరం దాతలను హెచ్‌ఎం అజిత, సర్పంచ్ మల్లీశ్వరి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి ఆపరేషన్లు



కంటి ఆపరేషన్లు చేసుకున్న వృద్ధులతో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రఘు

గంగవరం: మండలంలోని లయన్స్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో పలమనేరు నియోజకవర్గ పరిసర గ్రామాల నుంచి కొంతమంది వృద్ధులు కంటి ఆపరేషన్లను ఎంపికయ్యారు. ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి సహకారంతో వారికి కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాలలో ఉచితంగా ఆపరేషన్లు చేయించారు. కంటి ఆపరేషన్ల అనంతరం గురువారం వారందరినీ లయన్స్ క్లబ్‌కు తీసుకెళ్లారు. కొన్నాళ్ల పాటు కంటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను క్లబ్ అధ్యక్షుడు రఘు వారికి వివరించారు.

జలధితో జాతర పరిసమాప్తం

పెద్దపంజాణి: బాణసంచా మోత.. బ్యాండ్ మేళం.. విచిత్ర వేషధారణలతో భక్తులు..సాంస్కృతిక కార్యక్రమాలతో రాయలపేట గ్రామం హోరెత్తింది. పటాలమ్మ గంగమ్మ జాతరలో భాగంగా మూడోరోజు గురువారం అమ్మవారి జలధి కోలాహలంగా నిర్వహించారు. ఉదయం ఆలయం వద్ద నుంచి శిరస్సు మెరవణిని రాములవారి గుడి వీధి, హైస్కూల్ వీధి మీదుగా డప్పు వాయిద్యాల హోరు నడుమ గ్రామం చివరి వరకూ ఊరేగించారు. అమ్మవారి భక్తులు ప్రత్యేక పూజలు చేయడంతో పాటు కర్పూర హారతులిచ్చి, భారీగా కొబ్బరి కాయలు కొట్టి, మొక్కులు చెల్లించారు. అనంతరం అమ్మవారి జలిధి కార్యక్రమాన్ని నిర్వహించారు. చివరగా ఆలయం వద్ద హుండీ ఆదాయం లెక్కింపు నిర్వహించి అమ్మవారి చీరలను వేలం వేశారు. మూడు రోజుల జాతరను విజయవంతం చేసిన గ్రామస్తులకు, పోలీసులకు కార్యనిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు...

బుధవారం రాత్రి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున జనం రావడంతో ఆలయం పరిసరాలు జనసంద్రంగా మారాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పెద్దపంజాణి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

వరసిద్ధుని సేవలో చీపురుపల్లి ఎమ్మెల్యే



స్వామి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని గురువారం చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకట్రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. నగరంలోని గిరింపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహించారు. దీనికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని అన్నారు. అంటువ్యాధులు వ్యాప్తికాకుండా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం కావడంతో డయేరియా, మలేరియా, ఇతర సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందన్నారు. వ్యాధులు వ్యాప్తి చెందకుండా విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా కాచి చల్లార్చిన నీరు, శుభ్రమైన ఆహారం, వ్యక్తిగత శుభ్రతను పాటించాలన్నారు. కమిషనర్ అరుణ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. అన్ని వార్డుల్లో డయేరియా నియంత్రణ చర్యలు జరుగుతున్నాయని వివరించారు. వ్యాధులు రాకుండా విద్యార్థులు ప్రతిరోజు భోజనానికి ముందు, తరువాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని పిలుపునిచ్చారు. డీవైఈఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో చేతుల శుభ్రత కార్యక్రమాలను ఖచ్చితంగా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం చేతులను పూర్తిస్థాయిలో శుభ్రం చేసుకోవడం ఎలా అనే విషయాలపై వైద్యాధికారి స్వయంగా చేసి చూపించారు. అనంతరం ఎమ్మెల్యే ఆ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తిన్నారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, ఎంఈవోలు సెల్వరాజ్, మోహన్, హెచ్‌ఎం రమేష్ బాబు, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండండి



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పూతలపట్టు: విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మురళీమోహన్ సూచించారు. మండలంలోని చిన్నబండపల్లి గ్రామంలో గురువారం డయేరియా బారిన పడిన 8 మందిని కలిసి పరామర్శించారు. ఎలాంటి ఆందోళనకు గురికావద్దని భరోసానిచ్చారు. విషజ్వరాలు సోకిన వారికి అవసరమైన మందులను అందజేయాలని వైద్యాధికారులకు తెలియజేశారు. అనంతరం పూతలపట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వర్షాకాలంలో విష జ్వరాలు పెరుగుతాయని, ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల పట్ల జాగ్రత్త వహించి వారికి చికిత్సలు అందజేయాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

చంద్రుడిపై కోదండరాముడి వైభవం



ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న ఉభయదారులు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండ రామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి చంద్రప్రభ వాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి వేదపండితులచే అభిషేకం చేశారు. సుగంధపరిమళ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్య కైంకర్యాలను సమర్పించారు. భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఉభయదారులు కోదండరెడ్డి కుటుంబ సభ్యులచే వేదపండితులచే స్వామికి భక్తిప్రపత్తులతో తిరుమంజనం, ఉభయదారులు మదన్ మోహన్‌రెడ్డి కుటుంబసభ్యులచే స్వామికి పాలాభిషేకం చేయించి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో స్వామికి ఊంజల్‌సేవ

శ్రీ కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామికి భక్తిశ్రద్ధలతో ఊంజల్ సేవ నిర్వహించారు. స్వామికి పూజాసామగ్రి, పట్టువస్త్రాలు, సుగంధ పుష్పాలు, ప్రసాదాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. వేదపండితులు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. వేదమంత్రాలు పఠనం చేస్తూ ఊంజల్‌సేవను వైభవంగా నిర్వహించారు. భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. దీనికి ఉభయదారులుగా సాంబయ్య కుటుంబసభ్యులు వ్యవహరించారు.

చంద్రుడిపై శ్రీరామచంద్రుడి వైభవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా చంద్రప్రభ వాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామికి పూజాసామగ్రి, సుగంధపరిమళపుష్పాలు, పట్టువస్త్రాలు, ప్రసాదాలు, గజమాలలను మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉత్సవమూర్తికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. పూజలు ముగిసిన తరువాయి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. విద్యుద్దీపాలు, సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించిన వాహనంలో చంద్రుడిపై శ్రీరామచంద్రుడు కొలువై మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు ఇంటింటా కొబ్బరికాయలు కొట్టి, కర్పూర మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. దీనికి ఉభయదారులుగా పామినివాండ్లవూరు రామకృష్ణ కుటుంబసభ్యులు వ్యవహరించారు.

నేడు పుష్పపల్లకి సేవ

ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంకాలం ఊంజల్‌సేవ, రాత్రిలో పుష్పపల్లకి సేవ అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్దేశ్వరరెడ్డి, కార్యనిర్వాహకులు తెలిపారు. భక్తుల కాలక్షేపం కోసం పాటకచ్చేరి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని భక్తులు విశేషంగా పాల్గొనాలని పిలుపు నిచ్చారు.



చంద్రప్రభ వాహనంపై కొలువైన శ్రీరామచంద్రుడు

జీవాల్లో నీలి నాలుకపై అప్రమత్తత అవసరం

- టీకా ద్వారా వ్యాధి నివారణ
- వర్షాకాలంలో అప్రమత్తత అవసరం
- సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తప్పనిసరి
- పశు సంవర్ధక శాఖ ఏడీ పద్మావతి



గొర్రెలకు టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది(ఫైల్)

ఐరాల: వర్షాకాలంలో జీవాల్లో గొర్రెల్లో నీలినాలుక వ్యాధి వ్యాప్తి చెందుతుందని దీనిపై అప్రమత్తంగా ఉండాలని మండల పశుసంవర్ధక శాఖ ఏడీ పద్మావతి సూచిస్తున్నారు. వైరస్, క్యూలికోయిడస అనే ఈగ జాతికి చెందిన కీటకాల ద్వారా ఈ వ్యాధి సంక్రమించి ఒక జీవి నుంచి మరో జీవికి వ్యాపిస్తుంది. కీటకం శరీరంలోకి ప్రవేశించిన 10 రోజుల్లో ఒక్కో గొర్రె నుంచి మందలో గొర్రెలకు వ్యాపించే ప్రమాదం ఉంది. ముఖ్యంగా జూలై నుంచి డిసెంబర్ వరకు ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 15 వేల గొర్రెలు, మేకలను పెంచుతున్న వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వ్యాధి లక్షణాలు

కీటకం కాటు ద్వారా గొర్రె శరీరంలోకి వైరస్ ప్రవేశించిన వారం రోజుల్లో వ్యాధి లక్షణాలు గుర్తించవచ్చు. తొలుత 105–106 డిగ్రీల వరకు జ్వరం వచ్చి 5 రోజుల పైబడి ఉంటుంది. జ్వరం వచ్చిన 48 గంటల తరువాత నోటి నుంచి చొంగ కారడం, నోరు ఎర్రగా మారిపోవడం, చొంగ నురగలా మారి పెదవులు, చిగుళ్లు, పైదవడ, నాలుక వాచిపోవడం, దవడలు అసంకల్పితంగా వణుకుతాయి. నాలుక ఇరువైపులా పుండ్లు ఏర్పడి బాగా ఉబ్బి నీలి రంగుకు మారుతుంది. ఈ లక్షణాలన్నీ నీలినాలుక లక్షణాలుగా గుర్తించాలి. దీని కారణంగా నోటిలోపల భాగం పూర్తిగా దెబ్బతిని ఆహారం తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో పాటు గొర్రెలు పారడం, ఆ తరువాత పారుడులో రక్తపుజీరలు కనిపించడం, ముక్కులోపలి భాగం ఎర్రబడి చీము కారడం, అలాగే చీముతో పాటు రక్తం కారుతుంది. జిగురు పదార్థాలు ముక్కులో ఎండిపోవడంతో శ్వాస పీల్చుకోలేని పరిస్థితి నెలకొంటుంది. ఈ తరహా వ్యాధివలన చూడిగొర్రెల్లో గర్భస్రావం కలిగి జీవాలు మృతి చెందుతాయి.

చికిత్స విధానం ఇలా..

వైరస్ వల్ల వచ్చే వ్యాధులు కావడంతో వీటికి సరైన చికిత్స అంటూ ఏమీ లేదని, వ్యాధి ఉధృతిని తగ్గించేందుకు వైద్యమే సరైన మార్గమని పశువైద్యులు పేర్కొంటున్నారు. రోగ నివారణకు పొటాషియం పెర్మాంగనేట్ ఒకశాతం ద్రావణంతో నోటిలో పుండ్లను కడిగి, శుభ్రమైన పాడిగుడ్డతో తుడిచి యాంటీసెప్టిక్ మందులు పూయాలి. యాంటీసెప్టిక్ మందులు నోటి ద్వారా, ఇంజక్షన్ రూపంలో 5 నుంచి 7 రోజుల వ్యవధిలో అందించాలి. ఇందుకు సంబంధించి ఎన్రోఫ్లాక్సిన్, సిప్రోఫ్లాక్సిన్ తదితర యాంటీ బయాటిక్ మందులు వైద్యుల సూచనల మేరకు వాడుకోవాలి. దీంతో పాటు గొర్రెలకు అతిసారం సోకకుండా ఉండడానికి పలుచగా ఉన్న నూకల జావలో కొంచెం ఉప్పుకలిపి ఇవ్వడం అవసరమనుకుంటే గ్లూకోజ్, కొబ్బరినీళ్లు, ఎలక్ట్రాల్ పౌడర్ నీటిని తాగించడం మంచిది. వ్యాధి నుంచి కొంతమేర కోలుకుంటున్న జీవాలకు సెలైన్ ఇవ్వడం, లివర టానిక్, విటమిన్లు, ఖనిజ లవణాలతో కూడిన దాణా అదించడం శ్రేయస్కరం.

వ్యాధి సోకకుండా చర్యలు

ఈ తరహా వ్యాధులు సోకకుండా నివారణ చర్యలపై దృష్టి సారించాలి. ఇందుకు సంబంధించి రక్షాబ్లూ అనే టీకా మందు అందుబాటులో ఉంది. దీనిని గొర్రెలకు ఒక్కసారి ఇస్తే నాలుగేళ్లు ఇబ్బందులు ఉండవు. అలాగే గొర్రెల షెడ్డులో కీటకాలు నాశనం చేసేందుకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలి. సాయంత్రం వేళ ఎండిన వేపాకు పొగ వేయడం, రాత్రి సమయాల్లో మందకు దగ్గర్లో మంట ఏర్పాటు చేసి కీటకాలు వేడికి నశించేలా చేయాలి. గొర్రెల మందలో పశువులను ఉంచడం సరైన పద్ధతికాదు. వ్యాధి సోకిన జీవలను మంద నుంచి వేరుచేసి ప్రత్యేకమైన ప్రదేశాల్లో ఉంచి సరైన చికిత్స అందించాలి. వ్యాధితో చనిపోయిన జీవాల కళేబరాలను సుదూర ప్రాంతాల్లో లోతైన గొయ్యి తీసి సున్నం వేసి పూడ్చిపెట్టాలి. గొర్రె చనిపోయిన ప్రాంతం, వాటి మేత సామగ్రి, నీటి తొట్టెలను క్రిమిసంహారక మందులతో శుభ్రపర్చాలి. వ్యాధి గ్రస్త గొర్రెలు తినగా మిగిలిన దాణాను ఇతర గొర్రెలకు పెట్టకుండా కాల్చివేయాలి. వ్యాధి లక్షణాలను గుర్తిస్తే వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు చికిత్స అందించాలి.

జీవాల పెంపకందారులు జాగ్రత్తగా ఉండాలి



ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జీవాల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి. వ్యాధుల బారిన పడకుండా జీవాలను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఎప్పటికప్పుడు మందలోని గొర్రెల ఆరోగ్యాన్ని కనిపెట్టుకుని ఉండాలి. నీలినాలుక వ్యాధితో పాటు ఏ ఇతర జ్వర లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

–పద్మావతి, ఏడీ, ఐరాల